సాక్షి శ్రీకాకుళం

సోమవారం ¦ 10 ¦ జూలై ¦ 2023



అధిక పింఛన్..

ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పింఛన్ అందనుంది. ప్రభుత్వం ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది.

- 8లో



సాగునీటి సమస్యకు మోక్షం

ఇచ్ఛాపురంలో సాగునీటి సమస్యకు మోక్షం లభించింది. 1200 ఎకరాలకు సాగునీరు అందుతోంది.

- 8లో

తప్పిన ముప్పు



వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథి–చినవంక రోడ్డు పక్కన ఆదివారం మర్రి వృక్షం కొమ్మ విరిగి పడింది. విద్యుత్ తీగలు తెగి స్తంభాలు కూడా పడిపోయాయి. వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

న్యూస్‌రీల్

'గొర్రెలు, మేకల పెంపకం దారులకు అండగా ఉంటాం'



షీప్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం, చైర్మన్ ప్రకాష్‌లను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకదారులకు అండగా ఉంటామని షీప్ ఫెడరేషన్ (రాష్ట్ర గొర్రెల, మేకల సంఘం) శ్రీకాకుళం జిల్లా ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం, షీప్ ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్ అన్నారు. పలాస నియోజకవర్గ పర్యటనలో భాగంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూర్యరాజ్ ఇన్ మీటింగ్ హాల్‌లో ఆదివారం గొర్రెల, మేకల పెంపకదారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని గొర్రెలు,మేకలు పెంపకందారులతో పాటు పలాస నియోజకవర్గానికి సంబంధించిన పెంపకందారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం వివిధ రకాల పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ పానిల శ్రావణి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరి, జిల్లా యాదవ కుల ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు, లోహరిబంద సర్పంచ్ రాపాక శేషగిరి, కొండూరు సర్పంచ్ కొల్లి జోగారావు, రైతు సంఘ అధ్యక్షుడు మామిడి మాధవరావు, ఐతి ఈశ్వరరావు, రమణ, డొక్కరి దిలీప్‌కుమార్, కొర్రాయి గిరి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన



పలాసలో కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ పనులు పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరిశీలించారు. ముందుగా బి–బ్లాక్‌ను పరిశీలించి రెండు అంతస్తుల్లో జరుగుతున్న పనులు పరిశీలించారు. కిడ్నీరోగులకు డయాలసిస్ సేవలు అందించే గదులలో వాడుతున్న సామగ్రి కంపెనీల పేర్లు, నాణ్యతా ప్రమాణాలు చూశారు. త్వరలోనే ప్రారంభానికి సిద్ధం అవుతుండడంతో అన్ని పనులను నిశితంగా గమనించారు.

'ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తా'



మాట్లాడుతున్న ఛోటా కె.నాయుడు


శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్‌ల సంక్షేమానికి తన వంతుగా కృషిచేస్తానని ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు అన్నారు. ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఫొటో ఎక్స్‌పో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛోటా కె.నాయుడు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో రోజు రోజుకీ టెక్నాలజీ మారుతోందని, మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారి ప్రజలను ఆకట్టుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఫొటో ఎక్స్‌పో పెట్టడం గొప్ప విశేషమన్నారు. ఈ ఎక్స్‌పో ఇంతటి విజయవంతం కావడానికి ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు చేసిన కృషి అమోఘమన్నారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,60,000 ఫొటోగ్రాఫర్ల కుటుంబాలు ఉన్నాయన్నారు. గత మూడేళ్లుగా జిల్లాలో ఫొటో ఎక్స్‌పో పెట్టాలని అవిశ్రాంత కృషి చేశానని, ఇందులో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానన్నారు. అయితే ఫొటో ఎక్స్‌పో విజయవంతం కావడంతో అవన్నీ మరచిపోయానన్నారు. జిల్లాలో ఒక ఫొటోభవన్ నిర్మించేందుకు తన వంతుగా కృషిచేస్తానన్నారు. అలాగే ఫొటో, వీడియోగ్రాఫర్ ఎవరైనా ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందేలా పథకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలువురు ఫొటోగ్రాఫర్లను ఛోటా కె.నాయుడు చేతులమీదుగా సత్కరించారు.

పుస్తకంతో నేస్తరికం!



రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు

- నాణ్యమైన పాఠ్య పుస్తకాలు అందజేయడంలో ప్రభుత్వం సక్సెస్
- విద్యార్థులను ఆకట్టుకుంటున్న పుస్తకాలు
- జిల్లాలో సెమిస్టర్–1 కోసం 19.30 లక్షల పాఠ్య పుస్తకాల పంపిణీ
- పాఠ్యాంశాలకు సరికొత్తగా 'క్యూ ఆర్ కోడింగ్' ఏర్పాటు
- త్వరలోనే సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాల రాక



శ్రీకాకుళం న్యూకాలనీ: బడి గంట మోగిన తొలిరోజే విద్యార్థుల చేతికి పాఠ్య పుస్తకాలు అందించడంలో సర్కారు విజయవంతమైంది. జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ పాఠ్య పుస్తకాలు పిల్లలకు నేస్తాల్లా మారాయి. వీటి నాణ్యత, అధునాతన సాంకేతికత ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

సరి'కొత్త' హంగులతో..


విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో నాణ్యంగా తయారు చేసి అందజేశారు. ఆకర్షణీయ చిత్రాలు, కార్టూన్లు, రంగులు, నాణ్యమైన పేపర్, ఆయిల్ ప్రింటింగ్‌తో అందిన పుస్తకాలు విద్యార్థుల మనస్సు దోచుకుంటున్నాయి.

మూడుకు బదులు రెండు సెమిస్టర్లుగా..

విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు పుస్తకాల బరువు తగ్గించేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది మూడేసి సెమిస్టర్లను ముద్రించగా ఈ ఏడాది దాన్ని రెండు సెమిస్టర్లకు కుదించారు. దీని వల్ల టైటిల్స్ సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు. శ్రీకాకుళం జిల్లాలో 1.91 లక్షల మంది విద్యార్థులకు 19.30 లక్షల పాఠ్యపుస్తకాలను సెమిస్టర్–1 కింద విద్యార్థులకు అందజేశారు. ఇక సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలు త్వరలో జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయి.

చిత్రాలు, రంగులతో కొత్త రూపు..

విద్యార్థులకు పుస్తకాల పంపిణీని పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా చేపట్టింది. సబ్జెక్టులు, సెమిస్టర్ల వారీగా పుస్తకాలను అందజేశారు. పుస్తకాలు దుర్వినియోగం కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు. పై తరగతుల వారికి ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త పాఠ్యపుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారు.



పాఠ్య పుస్తకంలో క్యూఆర్ కోడ్

ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా..



గతంలో పాఠ్యపుస్తకాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు అందజేసేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది బడులు పునఃప్రారంభమైన జూన్ 12వ తేదీన వంద శాతం పుస్తకాలను ఉంచాం. ద్విభాషతో కూడిన ప్రింటింగ్ చాలా అద్భుతం. నాణ్యతతో లేకుంటే పుస్తకాలను రిటర్న్ చేసేయమని 'సవాల్' పేరిట మండల కేంద్రాల్లో కౌంటర్లను సైతంఏర్పాటుచేశాం. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆలోచన చేసింది. పాఠ్యపుస్తకాల ముద్రణకు సాంకేతికతను జోడించారు. చాలా ఖర్చుతో కూడుకున్నదైనా ఆధునికతను జత చేయ డం శుభ పరిణామం. – డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

విద్యార్థులకు ఉపయుక్తం..



ప్రభుత్వ పాఠశాలలో అందించిన పాఠ్యపుస్తకాలు చాలా బాగున్నాయి. పాఠశాల తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం కిట్లు అందించారు. ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా.. ఉపాధ్యాయులకు కూడా ఉపయుక్తంగా ఉన్నాయి. – పేడాద దాలినాయుడు, ఎంఈఓ–2 నరసన్నపేట, హెచ్‌ఎంల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

పుస్తకాలు చాలా బాగున్నాయి



మేము శ్రీకాకుళంలోని మంగువారితోట వద్ద ఉంటున్నాం. నాన్న శిల్లా నారాయణరావు రోజు కూలీ. అమ్మ శ్యామల. ఈ ఏడాది అందజేసిన పుస్తకాలు కొత్త కొత్త రంగులతో చాలా బాగున్నాయి. డిజిటల్ చదువులతో పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. – శిల్లా గోపిక, 10వ తరగతి విద్యార్థిని, శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బతుకుల్లో అలజడి

గార: తీరంలో పడవల రాక కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబ సభ్యులు



సిక్కోలు తీరం శోకసంద్రమైంది. రోజూ చూసే సముద్రమే గానీ ఆదివారం వేకువన మాత్రం వింతగా ప్రవర్తించింది. ముఖ్యంగా బందరువానిపేట, సీహెచ్ కపాసుకుద్ధి తీరాల్లో రాకాసి అలలు విరుచుకుపడ్డాయి. ఈ కెరటాల ధాటికి ఏకంగా ఆరు పడవలు బోల్తా పడ్డాయి. అందులో వేకువజామున జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. మరొకరు గల్లంతయ్యారు. ఇంకొందరు గాయాలతో బయటపడ్డారు. బతుకునిచ్చిన కడలిలోనే ఉసురు పోవడంతో మత్స్యకారుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. – గార, కవిటి

- వగబట్టిన సంద్రం
- బందరువానిపేట, సీహెచ్ కపాసుకుద్ధి తీరాల్లో ఆరు పడవలు బోల్తా
- ఇద్దరు మృతి, మరొకరు గల్లంతు

బందరువానిపేట తీరంలో..



గార: మృతి చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య



గార: గల్లంతైన గుంటు గణపతి (ఫైల్)

గార మండలం బందరువానిపేట తీరం ఆదివారం మత్స్యకారులను వణికించింది. వేకువ నుంచి మధ్యాహ్నం వరకు ఇక్కడ రాకాసి అలలు గంగపుత్రులను భయపెట్టాయి. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వేకువ జామున సిడిపిల్లి సూరిబాబుకు చెందిన పడవలో ఆరుగురు మత్స్యకారులు వేటకు బయల్దేరారు. సాధారణంగా జూన్ నెలాఖరు నుంచి సముద్రం అల్లకల్లోలంగానే ఉంటుంది. మత్స్యకారులకు కూడా ఈ విషయం తెలుసు. కానీ వేకువన చీకటిలో వచ్చిన పెద్ద అల ఒకటి ఈ పడవను ముంచేసింది. దీంతో పడవలో ఉన్న పుక్కళ్ల లక్ష్మయ్య(54), గుంటు గణపతి(50) గల్లంతైపోయారు. మిగిలిన నలుగురు సిరిపిల్లి సూర్యనారాయణ, గుంటు తులసి, దుమ్ము కన్నయ్య, మరో మత్స్యకారుడు ఎలాగోలా బయటపడ్డారు. ఈ పడవ తెల్లారేసరికి పోలాకి మండలం రాజారాంపురం తీరానికి కొట్టుకుని వచ్చింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న తహసీల్దార్ జెన్ని రామారావు, ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్ హేమంత్ కుమార్, మెరైన్ పోలీసులు గ్రామానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆఖరుకు పుక్కళ్ల లక్ష్మయ్య మృతదేహం సంతబొమ్మాళి మండలం చెరువుగట్టుపేట, పిట్టవానిపేట తీరాల మధ్య ఒడ్డుకు చేరింది. గణపతి ఆచూకీ ఇంకా లభించలేదు. పుక్కళ్ల లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గణపతికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అంతా చూస్తుండగానే..

వేకువజామున జరిగిన ప్రమాదంతో బందరువానిపేట తీరంలో మత్స్యకారులు, అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ తీరం నుంచి రోజూ 50 నుంచి 70 పడవలు వెళ్తుంటాయి. దాదాపు 400 మంది వేటకు వెళ్లారు. ఉదయం నాలుగింటికే ఓ ప్రమాదం జరగడంతో.. సముద్రం లోపలకు వేటకు వెళ్లిన వారు సురక్షితంగా ఒడ్డుకు రావాలని వారి కుటుంబ సభ్యులు, అధికారులు ఉదయం తీరానికి చేరుకున్నారు. పది గంటల సమయంలో బోట్లు తిరుగుముఖం పడడంతా అంతా తీరం వైపే చూడసాగారు. వారి అనుమానం నిజమై నాలుగు పడవలు ఒడ్డుకు చేరువలో బోల్తా పడ్డాయి. 24 మంది మత్స్యకారులు అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అక్కడే ఉన్న తహసీల్దార్ జెన్ని రామారావు వెంటనే అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారితో మాట్లాడి యుద్ధప్రాతిపదికన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించడంతో పాటు రెండు 108 వాహనాలను ఉంచారు. గాయాలైన మత్స్యకారులకు చికిత్స అందించారు.



కవిటి: సీహెచ్ కపాసుకుద్ధితీరంలో బడే ఢిల్లేశు మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కపాసుకుద్దిలో..



బడే ఢిల్లేశు(ఫైల్)

చిన్ననాటి నుంచి అలవాటైన పడవ ఆయన ప్రాణాలను కాపాడలేకపోయింది. ఊహ తెలిసినప్పటి నుంచి ఉపాధి చూపించిన సముద్రం ఆ మత్స్యకారుడి ఉసురు తీసింది. ఆదివారం వేకువజామున సీహెచ్ కపాసుకుద్ధి తీరం నుంచి అదే గ్రామానికి చెందిన బడే ఢిల్లేశు(40) మరో నలుగురితో కలిసి చేపల వేటకు బయల్దేరాడు. కొంత దూరం వెళ్లాక అలల ఉద్ధృతి బాగా పెరిగింది. దీంతో మర పడవలో ఉన్న ఢిల్లేశు కింద పడి బోటు అడుగు భాగానికి వెళ్లిపోయాడు. బయటకు వచ్చేందుకు ఎంతగా ప్రయత్నించినా రాలేకపోయాడని తోటి మత్స్యకారులు చెప్పారు. మృతుడికి భార్య తిరుపతమ్మ, కుమారుడు బాలు, కుమార్తె అంజలి ఉన్నారు. ఇంటి యజమాని మరణవార్త విని వారు తల్లడిల్లిపోయారు. కవిటి హెచ్‌సీ రూప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.



గార: బందరువానిపేటలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం



గార: రాజారాంపురం తీరానికి కొట్టుకు వచ్చిన పడవ

సమన్వయం సులభం.. పర్యవేక్షణ పటిష్టం

- ఒకే గొడుగు కిందకు వసతి గృహాలు
- ప్రతి మూడు మండలాలకు ఒక సంక్షేమ అధికారి
- కసరత్తు పూర్తి.. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపు

నరసన్నపేట: జిల్లాలో వసతి గృహాల పర్యవేక్షణ మరింత సులభతరం చేస్తూ క్లస్టర్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ విధానంతో అన్ని హాస్టళ్లు ఒకే గొడుకు కిందకు రానున్నాయి. దీంతో ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ మరింత పటిష్టం కానుంది. ఇప్పటికే వసతి గృహాలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వం ఇటీవలే విద్యార్థులకు ఇచ్చే మెస్, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచింది. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ నిర్ణయం వల్ల ప్రతి మూడు మండలాలకు ఓ సహాయ సంక్షేమ అధికారి ఉంటారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రభుత్వం రూపకల్పన చేసిన ఈ క్లస్టర్ విధానాన్ని మరికొద్ది రోజుల్లో అమలు చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తు అంతా పూర్తి చేశారు. ప్రభుత్వ అనుమతి రావడమే ఆలస్యం.. అమలుకు చర్యలు తీసుకోనున్నారు.

క్లస్టర్ విధానం ఇలా..

జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 81 వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 31 వసతి గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఆయా శాఖలకు సంబంధించిన అధికారులే వసతి గృహాలను పర్యవేక్షించేవారు. అయితే క్లస్టర్ విధానం అమల్లోకి వస్తే అన్ని శాఖలకు సంబంధించిన వసతి గృహాల పర్యవేక్షణ ఆయా సహాయ సంక్షేమ అధికారికి అప్పగిస్తారు. ప్రస్తుతం జిల్లాను 9 క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో సహాయ సంక్షేమ శాఖ అధికారి ఉంటారు. ఈ విధానంపై జిల్లాలోని వార్డెన్లు, మేట్రిన్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉంది



వసతి గృహాలు అన్నీ ఒకే గొడుకు కిందకు చేర్చాలని ప్రభుత్వం ఇటీవల జీఓ జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ఉన్న బీసీ, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలతో పాటు ఇతర వసతి గృహాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి అయింది. అధికారులతో చర్చించి క్లస్టర్ విధానంపై కసరత్తు పూర్తి చేశాం. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అనుమతి పంపుతున్నాం. ఆమోదం వచ్చిన వెంటనే అమలు చేస్తాం. – విశ్వమోహనరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ



నరసన్నపేటలోని ప్రభుత్వ వసతి గృహం

ఆదిత్యుని సన్నిధిలో

భక్తుల రద్దీ



సూర్యనమస్కారాల పూజలు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అలంకరణలో స్వామిని సర్వదర్శనాలకు అనుమతించారు. ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకోగా విశాఖపట్టణం సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి కూడా కుటుంబ సభ్యులతో ఆదిత్యుని దర్శించుకున్నారు. అలాగే తాజా సివిల్స్ ర్యాంకర్ చల్లా కల్యాణి కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరివెంట 1వ పట్టణ సీఐ ఎల్ఎస్ నాయుడు, చల్లా అసిరినాయుడు, కట్టా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఇక ఈ ఒక్కరోజున వివిధ దర్శనాల రూపంలో రూ.3, 58, 200, విరాళాల రూపంలో రూ.1, 23, 933, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.40లక్షలు మేరకు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలియజేశారు.



అమ్మరూపం.. అపురూపం

పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారిని ఆషాడ మాసం సందర్భంగా శాకంబరిగా ఆదివారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. -పాతపట్నం

● కప్పల సంబరం



అల్లినగరం గ్రామంలో ఆదివారం వర్షాలు కురవాలని కప్ప సంబరం నిర్వహించారు. కప్పల సంబరం నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయని, పంటలు పండుతాయని ప్రజలు విశ్వసిస్తారు. మహిళలు సంబరంలో పాల్గొని కప్పలకు బిందెలతో నీళ్ల పోశారు. ఊరంతా కప్పలను ఊరేగించారు. ఎచ్చెర్ల క్యాంపస్

● జగనన్న కోసం..

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని 175 నియోజకవర్గాలు బైక్ యాత్ర చేపడుతున్నానని పాస్టర్ అడివికట్టు రాజు తెలిపారు. ఆయన ఆదివారం ఎచ్చెర్ల నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనది నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలోని జలదింగి మండలంలోగల అన్నవరం గ్రామమని, టీవీఎస్ ఎక్సెల్‌పై మే 14న యాత్ర ప్రారంభించానని తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గంతో ఇప్పటికి 134 నియోజకవర్గాలు పూర్తి చేసుకుని 135వ నియోజకవర్గం శ్రీకాకుళం వెళ్తున్నానని చెప్పారు. తనకు కోవిడ్ వచ్చినప్పుడు క్వారంటైన్‌లో మంచి ఆహారం అందించి ఆదుకున్నారని, తర్వాత గుండెకు సంబంధించిన సమస్య వస్తే అర్ధరాత్రి 12.10కు ఫోన్ చేసినా 108 వచ్చి 14 నిమిషాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేసి గుండెల్లో రంధ్రాలు పూడ్చారని తెలిపారు. ఆరోగ్య శ్రీ మీదే ఆపరేషన్ జరిగిందని, రూపాయి కూడా ఖర్చు కాలేదని వివరించారు. అందుకే ఆయన మళ్లీ సీఎం కావాలని యాత్ర చేస్తున్నానని తెలిపారు. – రణస్థలం



క్లుప్తంగా

విద్యావేత్త దీర్ఘారావుకు నివాళులు



దీర్ఘారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీలు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన విద్యావేత్త, దివంగత ప్రొఫెసర్ కొర్రాయి దీర్ఘారావుకు వక్తలు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. స్వగ్రామం బూరగాంలో ఆదివారం పెద్దకర్మ నిర్వహించారు. కార్యక్రమంలో కంచిలి, సోంపేట ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఇప్పిలి కృష్ణారావు, మడ్డు వెంకటరావు, మద్దిలి భీమారావు, మడ్డు వెంకటేశ్వరరావు, పిల్లల లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి విరాళాల వెల్లువ



విరాళాన్ని అందజేస్తున్న శ్రీనాథ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వివిధ సేవలు, అభివృద్ధి పనుల నిమిత్తం పలువురు భక్తులు ఆదివారం విరాళాలు సమర్పించారు. అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన శ్రీనాథ శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు తమ కుమారుడు శ్రీనాథ స్వరూప్, సుజాతల పేరిట అభివృద్ధి పనుల కోసం రూ.1,01,001, శాశ్వత అన్నదాన పథకానికి రూ.25వేలు విరాళాన్ని ఈవో వి.హరి సూర్యప్రకాష్‌కు అందజేశారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా మామిడిపల్లికి చెందిన ఎం.పద్మలత శాశ్వత అన్నదానానికి రూ.1,00,116 విరాళం ఈవోకు అందజేశారు.

వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారెళ్ల



మారెళ్ల అప్పలనాయుడు

నరసన్నపేట : మేజరు పంచాయతీ నరసన్నపేటకు చెందిన వీఆర్వో మారెళ్ల అప్పలనాయుడు వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఆ నేత్రాలు సజీవం



పట్నాల వెంకటరాజు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని చిన్నబజారు నీలమ్మతల్లి ఆలయం సమీపంలో నివాసముంటున్న పట్నాల వెంకటరాజు(60) అనారోగ్య కారణంతో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అనుమతి మేరకు ఆదివారం సేకరించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. రెడ్‌క్రాస్ మగటపల్లి కల్యాణ నేత్రసేకరణ కేంద్రం సిబ్బంది వెళ్లి కార్నియాను సేకరించారని చెప్పారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేత్ర సాంకేతిక నిపుణులు సుజాత, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,510-00
బంగారం(22కి. 10గ్రా.)	54,550-00
వెండి (కిలో)	76,700-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

ఆర్టీసీ ఉద్యోగులకు.. అధిక పింఛన్

- హయ్యర్ పెన్షన్ స్కీమ్‌కు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ నెల 11 వరకు నమోదు చేసుకునే అవకాశం
- జిల్లాలో 1334 మంది ఉద్యోగులకు లబ్ధి



ఆర్టీసీ కాంప్లెక్స్

డిపో	ఉద్యోగులు
శ్రీకాకుళం 1	378 మంది
శ్రీకాకుళం 2	385 మంది
టెక్కలి	280 మంది
పలాస	280
శ్రీకాకుళం కాంప్లెక్స్ కార్యాలయం	10 మంది

శ్రీకాకుళం అర్బన్: దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన జగన్ సర్కారు ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది. ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ఆర్టీసీ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పింఛన్ పథకం (హయ్యర్ పెన్షన్ స్కీమ్)ను ప్రభుత్వం సిద్ధం చేసింది. గతంలో ఉద్యోగ విరమణ అనంతరం కనీస పెన్షన్ రూ.500 నుంచి రూ.5వేలు మాత్రమే అందేది. అదే హయ్యర్ పెన్షన్ స్కీమ్ ఉంటే పాత పెన్షన్ కన్నా 5 నుంచి 6 రెట్లు ఎక్కువ పొందే వీలుంటుంది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగికి భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కొత్త పథకం ద్వారా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేరనుంది. పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 3 నుంచి మే 3వ తేదీ వరకూ, రెండో విడత మే 4 నుంచి జూన్ 26 వరకూ అవకాశం కల్పించింది. కొద్దిమంది ఉద్యోగులు సాంకేతిక లోపం కారణంగా సరైన వివరాలు నమోదు చేయకపోవడం, మరికొంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది.

జూలై 11 వరకు గడువు..

మూడో విడతగా జూన్ 27 నుంచి జూలై 11వ తేదీ వరకూ గడువు ఇస్తూ నమోదు చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కించి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

లాభదాయకం..



ఆర్టీసీ ఉద్యోగికి పథకం ఎంతో లాభదాయకం. పథకం తీసుకొచ్చినందుకు ఆర్టీసీ ఎండీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగికి చాలా తక్కువ మొత్తంలో పెన్షన్ వస్తుంది. రానున్న కొత్త పెన్షన్ పథకం అమలులోకి వస్తే పెన్షన్ 5 నుంచి 6రెట్లు పెరిగే అవకాశం ఉంది.

-జి.త్రినాథ్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

వాయిదా పద్ధతి మేలు..



ఆర్టీసీలో ప్రవేశపెట్టిన హయ్యర్ పెన్షన్ పథకం మంచిదే. అయితే ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బులు కట్టాలంటే ఉద్యోగులకు ఇబ్బందులు ఏర్పడవచ్చు. ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించి వాయిదాల పద్ధతిలో రికవరీకి అవకాశం కల్పిస్తే బాగుంటుంది.

- వై.అప్పయ్య, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి

అవగాహన కల్పించాం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 1334 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించాం. ఉద్యోగుల దరఖాస్తులను ఇప్పటికే నమోదు చేసి పంపించాం.

- ఎ.విజయ్‌కుమార్, జిల్లా ప్రజారవాణా అధికారి

ఆర్టీసీ ఉద్యోగులకు మేలు..



ఆర్టీసీ ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అధిక పెన్షన్ పథకం తీసుకు రావడం సంతోషంగా ఉంది. నమోదు అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశం కల్పించాలి.

- ఎస్.నరేష్‌కుమార్, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఎంబీసీల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అరవింద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ఉత్తరాంధ్ర ఎంబీసీ కన్వీనర్ డాక్టర్ అరవింద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో కంపోస్టుకాలనీలో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో అనేక బీసీ కులాలున్నా నాలుగైదు కులాలు మాత్రమే బీసీ రిజర్వేషన్‌ను అనుభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితి మారాలంటే వెనుకబడిన వర్గాలవారంతా ఏకమై ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు పిట్ట చంద్రపతిరావు, డి.పి.దేవ్, గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం, శ్రీనివాసరావు, పసగాడ రామకృష్ణ, మూగి గురుమూర్తి, ఎ.త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు కొప్పల భానుమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీరు మార్చుకోవాలని ఏపీ రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు కొప్పల భానుమూర్తి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఏపీటీవో-ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విస్తృత స్థాయి సదస్సు నిర్వహించారు. ఫ్యాప్టో అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.భానుమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ సిలబస్‌ను ఇష్టం వచ్చినట్టు మార్చడం సరికాదన్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదన్మోహన్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ సెలవు రోజుల్లో, అర్ధరాత్రి వేళ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదన్నారు. ఉపాధ్యాయుల కామన్ సీనియారిటీ సమస్య పరిష్కరించకుండా ఉపాధ్యాయులను గందరగోళపరిచే విధంగా ప్రమోషన్లు కల్పించడం సరికాదని మండిపడ్డారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, ఫ్యాప్టో కో చైర్మన్ పొందూరు అప్పారావు, రెడ్డి మోహన్‌రావు, పేకేటి రామారావు, బల్ల సుభాష్‌బాబు, సంపతిరావు కిషోర్‌కుమార్, ఏపీ సీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, కోత ధర్మారావు, బి.రవి, వెంకటరమణ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ తెలుగు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పడిన పీజీటీ తెలుగు ఖాళీ పోస్టును భర్తీ చేసేందుకు ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్ల నుంచి తక్షణమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు వారి విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో నెల 10న ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయం వద్దకు హాజరుకావాలని ఆయన కోరారు.

అతివలు చేపట్టిన అంతిమ యాత్ర



అనాథ మృతదేహాన్ని తరలిస్తున్న మహిళలు

కాశీబుగ్గ: అనాథ మృతదేహానికి మహిళలే అంతిమ యాత్ర చేసిన ఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పలాస జాతీయ రహదారి కోసంగిపురం కూడలి పక్కన లలితా అనాథ వృద్ధాశ్రమంలో నటరాజు అనే వృద్ధుడు మరణించాడు. కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవడంతో ఆశ్రమ నిర్వాహకురాలు సువ్వారి పద్మావతి, ఆమె సోదరి లక్ష్మి, సహాయకురాలు జయ కలిసి మరో వ్యక్తి సహకారంతో దహణ సంస్కారాలు పూర్తి చేసి ఔదార్యం చాటుకున్నారు.

సాగునీటి సమస్యకు మోక్షం

- పూర్తయిన కేశుపురం న్యూ గ్రోయిన్ పనులు
- 1200 ఎకరాలకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు




కలెక్టర్ నిధులతో పూర్తయిన కేశుపురం న్యూ గ్రోయిన్

ఇచ్ఛాపురం రూరల్: గత పాలకుల నిర్లక్ష్యానికి ఇచ్ఛాపురం మండలంలోని కేశుపురం, బూర్జపాడు, డొంకూరు, నీలాపుట్టుగ, సన్యాసిపుట్టుగ, లక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు వరి సాగుకు దూరమయ్యారు. 2018 అక్టోబర్ 10న సంభవించిన తిత్లీ తుఫాన్ ధాటికి ఈదుపురం వద్ద గతంలో నిర్మించిన కేశుపురం న్యూ గ్రోయిన్ కొట్టుకుపోయింది. అప్పటి నుంచి రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు లేక రైతులకు ఇబ్బందులు తప్పలేదు. అప్పటి అధికార టీడీపీ ప్రభుత్వం రైతులకు కల్లబొల్లి కబుర్లు చెబుతూ అదిగో మరమ్మతులు చేపడుతున్నాం, ఇదిగో గ్రోయిన్ నిర్మిస్తున్నామంటూ ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఇటు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు ఆశలు చూపి ఓట్లు దండుకున్నారే తప్పా పనులు చేపట్టలేదు. దీంతో సుమారు 1200 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు సొంతంగా వేలాది రూపాయలు నిధులు కూడబెట్టి ఇసుక బస్తాలతో తాత్కాలిక గ్రోయిన్ ఏర్పాటు చేశారు. ఆ గ్రోయిన్ మూడు రోజుల్లో కూలిపోవడంతో రైతులు నిరాశ చెందారు. ఈ క్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజులు గ్రోయిన్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.28లక్షలు మంజూరు చేశారు. స్థానిక రైతులు గ్రోయిన్‌ను నిర్మించేందుకు ముందుకు రావడంతో రెండు నెలల్లో పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం హామీలతో కాలయాపన చేస్తే, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతలతో పనులు పూర్తి చేసిందని, ఈ ఏడాది ఖరీఫ్ నాటికి ప్రతీ ఎకరాకు సాగునీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సొంత నిధులతో తాత్కాలిక గ్రోయిన్ పనులు చేపడుతున్న రైతులు(ఫైల్)

గత పాలకులు మోసం చేశారు..



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పాలకులు గ్రోయిన్ నిర్మాణం పేరుతో వందలాది మంది రైతులను మోసం చేశారు. 11 గ్రోయిన్‌లను నిర్మిస్తున్నామని చెప్పి ఓట్లు దండుకున్నారు. వేలాది రూపాయలతో రైతులే సొంతంగా తాత్కాలిక గ్రోయిన్ నిర్మించినప్పటికీ ఫలితం కనిపించలేదు. సమన్వయకర్త పిరియా సాయిరాజు కృషి ఫలితంగా రూ.28లక్షలతో ఖరీఫ్ పాటికి గ్రోయిన్ పనులు పూర్తయ్యాయి.

- గుజ్జు ఢిల్లీరావు, సర్పంచ్, కేశుపురం

చలో ఢిల్లీ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఓబీసీ సాధన కోసం రానున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల సమయంలో నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సంఘ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీ సాధన కోసం ఇప్పటికే ప్రధాని మోదీ, ఎంపీలు, కేంద్ర మంత్రులను కలిశామని, మరికొద్ది రోజుల్లో లక్ష్యం నెరవెరబోతోందన్నారు. అనంతరం సంఘ నూతన జిల్లా అధ్యక్షునిగా డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గజరావు వినోద్, ప్రధాన కార్యదర్శిగా సదాశివుని కృష్ణ, కోశాధికారిగా ఉరిటి కిరణ్, బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా వాసు మాట్లాడుతూ నిరుపేద శిష్టకరణాలకు ఆర్థికంగా చేయూతనిస్తామన్నారు. సభ్యత్వ నమోదుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బలివాడ మల్లేశ్వరరావు, పోలుమహంతి జగన్మోహన్‌రావు, ఇప్పిలి జగన్నాధరావు, డి.వెంకటరావు, ఆర్.వి.ఎన్ శర్మ, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, ఆరికతోట కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

కంచిలి: చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగల్ని కంచిలి పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, కంచిలి ఎస్ఐ ఎస్.బాలరాజుతో కలిసి కంచిలి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా దేబభూమి గ్రామానికి చెందిన గణేష్ దాస్, సురడా జిల్లా కాయితాపల్లికి చెందిన శంకర్ పాత్రలను అంపురం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. 2022 అక్టోబర్ 12న కంచిలికి చెందిన సాహుకారి వనిత తన ఇద్దరు పిల్లల్ని జె.ఎం.జె.పాఠశాలలో విడిచిపెట్టి తిరిగి ఇంటికి వస్తుండగా గణేష్‌దాస్, శంకర్‌పాత్రలు పావు తక్కువ రెండు తులాలు బంగారు పుస్తెలతాడును తెంచుకుపోయారు. అదేవిధంగా, ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో 2022 సెప్టెంబర్ 1న యాదం రాధిక అనే మహిళ నుంచి ఒకటింపావు తులం బంగారు గొలుసును తెంచుకుపోయారు. ఈ రెండు దొంగతనాలు తామే చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వీరి నుంచి చోరీ సొత్తు 3 తులాలను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన కంచిలి ఎస్ఐ ఎస్.బాలరాజును డీఎస్పీ అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ కె.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎన్.చంద్రయ్య, ప్రసాద్, భుజంగరావు, మాధవరావులకు రివార్డులు అందించారు.

ఆకట్టుకున్న ద్విగళ నవావధానం



అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో కోదండరామాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ద్విగళ నవావధానం ఆద్యంతం అలరించింది. ఈ సందర్భంగా ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ నూతనంగా మన జిల్లాలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవధానం సంచాలకులుగా వ్యవహరించిన బంకుపల్లి రమేష్ శర్మ మాట్లాడుతూ ఇందులో ఇద్దరు అవధానులు, 9 మంది ప్రాశ్నికులు ఉంటారని, వారు అడిగిన ఒకే ప్రశ్నకు ఇద్దరు అవధానులు వేరువేరుగా బదులు ఇస్తారని వివరించారు. ఇందులో కొత్తగా గంటావధాన ప్రక్రియ ఉంటుందని, ప్రాశ్నికుడు గంట వాయించి పద్యాన్ని వివరించమని కోరుతారని తెలిపారు. కార్యక్రమంలో అవధానులు సుసరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్‌శర్మ, పులఖండం శ్రీనివాసరావు, బి.కోమలరావు, ఎం.వెంకటరమణ, పి.శాంతమ్మ, ఎస్.నారాయణమూర్తి, వి.వి.నాగేంద్ర, ఎన్.నర్సింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు, పి.వి.ఎస్.సాయిప్రసాద్, మందిరం కార్యదర్శి కామేశ్వరరావు, సీహెచ్.బాబూరావు, ఈశ్వరరావు, పతంజలి శాస్త్రి, దుర్గారావు, ఎం.మోహనరావు, కె.విజయకుమార్, ఆర్.ప్రసాదరావు, సరస్వతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు ఆదివారం మృతి చెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. సాయిబుల కాలనీకి చెందిన ఆర్.సత్యనారాయణ విద్యుత్‌శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు కుమారుడు భాస్కర్ కన్నమరాజు (23), ఓ కుమార్తె ఉన్నారు. భాస్కర్ పంజాబ్‌లోని ఎల్‌పీయూ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతూ ఆరోగ్యం బాగోలేనందున 2023 జనవరిలో వచ్చేశాడు. విశాఖపట్నంలో అప్పుడప్పుడూ వైద్య పరీక్షలు చేసుకుండేవాడు. ఇంటివద్దే ఉంటూ మూడు నెలలుగా శాంతినగర్ కాలనీలో డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ.. అక్కడికి వచ్చువారికి స్విమ్మింగ్ నేర్పించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 8న స్విమ్మింగ్ చేస్తుండగా నీటిలోనే మూర్ఛరోగం రావడంతో మునిగిపోయాడు. అక్కడఉండేవారు బయటకు తీసి రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

స్విమ్మింగ్‌లో అలుదు విద్యార్థి ప్రతిభ



బంగారు పతకంతో అవినాష్‌కుమార్

సారవకోట: మండలంలో అలుదు గ్రామానికి చెందిన పొన్నాన అవినాష్‌కుమార్ ఆదివారం నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్మిమింగ్ పోటీల్లో సత్తాచాటాడు. 100 మీటర్ల బటర్ ఫ్లైలో బంగారం, 50, 200 మీటర్ల బటర్ ఫ్లైలో రజతం, 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజత పతకం సాధించాడు. అవినాష్‌కుమార్ బెంగళూరులోని రాహుల్ ద్రావిడ్ అకాడమీలో శిక్షణ తీసుకుంటూ అక్కడే 7వ తరగతి చదువుతున్నారు. తండ్రి రాజేష్ రాజస్థాన్‌లో ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. అవినాష్ ప్రతిభ కనబరచడం పట్ల విజయాంబికా యువజన సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు, గ్రామస్తులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని కొల్లివలస గ్రామానికి చెందిన తోట కృష్ణారావు ఆదివారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒక్కడే నివాసముంటున్నాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఈయన ఆదివారం గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

MARRIAGE SERVICES

- అన్ని కులముల వారికి ప్రథమ మరియు ద్వితీయ పెండ్లి సంబంధములు కుదర్చబడును. శ్రీ శ్రీనివాసా మ్యారేజ్ లింక్స్, శ్రీకాకుళం. ఫోన్ : 82475 99336, వాట్సాప్ : 91771 63987 [V- 2001]

- శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నందు వర్క్ చేయుటకు బిజినెస్ డవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ / ఆపరేషన్స్ / మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్-50(M). (M/F), Qlf : Degree, Exp : 0-1Year. Srikulam. Pradeep (BM) ఫోన్ : 89194 93549 [V- 794669]
- హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. హైదరాబాద్ Ph: 9640258899, విజయవాడ Ph:9640648899 [H-189305]
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd ఫోన్ : 7995374999. [HA-395]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.